క్లుప్తంగా

తిరుమల బాలాజీకి తిరుప్పావడ సేవ



తిరుమల బాలాజీకి రాశులుగా నివేదించిన పులిహోర

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామి వారికి గురువారం తిరుప్పావడ సేవను భక్తిశ్రద్ధలతో జరిపించారు. పులిహోరను రాశులుగా పోసి స్వామికి నివేదించిన అనంతరం ప్రసాద వితరణ చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు భరోసా కరువు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా లేకుండా చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలో 1134వ రోజు, గురువారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గం మొక్కవోని దీక్షతో నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం కార్మికవర్గానిదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్లమ్మ వారి సన్నిధిలో గురువారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామ్యంత్రం రుత్వికుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచార్యులు, అర్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో రుత్వికులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అటవీ దినోత్సవం



టౌన్‌షిప్‌లో నాటిన కొబ్బరి మొక్కలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో గురువారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగంలో ఆధ్వర్యంలో టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాల్లో సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఒక ప్రాంతంలో 125 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా పలు విభాగాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏ అనుమతి అయినా సువిధ యాప్‌లోనే..

- పార్టీలపై నిరంతర నిఘా
- ప్రతీ కదలికపై వీడియో
- పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు
- 15 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో పర్యవేక్షణ
- ఫిర్యాదులపై గంటలోనే చర్యలు
- సాక్షితో గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

గాజువాక: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు గాని, రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న వ్యక్తులు గాని తమ రాజకీయ కార్యకలాపాలకు 48 గంటల ముందుగానే ఎన్నికల కమిషన్ నుంచి అనుమతులు తీసుకోవాలని గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి చెప్పారు. ఎవరైనా వచ్చి అప్పటికప్పుడు పర్మిషన్ కావాలంటే ఇవ్వడం సాధ్యం కాదన్నారు. అనుమతులు, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులకై నా యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సాక్షికి ఆయన గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్నికల నిబంధనలకు సంబంధించి వివిధ అంశాలను తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

48 గంటల ముందు పర్మిషన్ తప్పనిసరి

ఎన్నికలకు సంబంధించిన అన్ని అనుమతులు సువిధ యాప్‌లో లభిస్తాయి. వాహనాలకు సంబంధించిన అనుమతులు, పార్టీ కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, సభలు, సమావేశాలు తదితర అన్ని అనుమతులు ఈ యాప్‌లో లభిస్తాయి. పార్టీలకు సంబంధించిన స్టిక్కర్లు మోటారు వాహనాలకు అతికించుకోవాలన్నా అనుమతి కావాల్సిందే. కార్లతో పాటు బైక్‌లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. అవి కూడా 48 గంటల ముందుగానే యాప్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పటికప్పుడు అనుమతులు ఇవ్వడం సాధ్యం కాదు.

ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం

85 ఏళ్లు దాటిన వారితో పాటు దివ్యాంగులు కూడా ఇంటినుంచే ఓటు వేసే సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. 85 ఏళ్లు పైబడ్డ ఓటర్లు గాజువాక నియోజకవర్గంలో సుమారు 850 మంది ఉన్నారు. దివ్యాంగులు 3,600 మంది ఉన్నారు. వారి వైకల్యం 40 శాతం దాటి ఉండి, ఆ విషయాన్ని ఓటరు జాబితాలో నమోదు చేసుకుని ఉంటేనే వారు ఇంటినుంచి ఓటు వేసే సౌకర్యాన్ని ఉపయోగించుకోగలుగుతారు. ఓటరు జాబితాలో వారి వైకల్యాన్ని నమోదు చేసుకోకపోతే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోలేరు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సిందే.

కోడ్ వచ్చిన రోజు నుంచే ప్రారంభం

ఎన్నికల కోడ్ వచ్చినరోజు నుంచే ఎన్నికల కమిషన్ పని మొదలైంది. ఆ రోజు ఉక్కునగరంలో కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభతో మా పని ప్రారంభమైంది. ఆ సభ మొత్తం వీడియో తీశాం.

24/7 బృందాల పర్యవేక్షణ

ఎన్నికల నిబంధనలను చాలా మైక్రోలెవెల్‌లో పరిశీలిస్తున్నాం. దీనికోసం 15 బృందాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. మూడు ఫ్లయింగ్ టీమ్‌లు, మూడు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్‌లు, మూడు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, రెండు వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, వీడియో వెరిఫికేషన్ టీమ్ ఒకటి, అకౌంట్స్ టీమ్‌లు రెండు పని చేస్తున్నాయి. ఈ బృందాలు 24/7 పని చేస్తాయి. ఈ పనిని నిరంతరం నిర్వహిస్తూనే మరోపక్క ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల కోసం సిబ్బందిని సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే సంబంధిత సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశాం.

ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించాం

కోడ్ వెలువడిన 24 గంటల్లోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకుల ఫొటోలను తొలగించాం. 48 గంటల్లోగా బహిరంగ ప్రదేశాల్లో పార్టీల ఫ్లెక్సీలను తొలగించి నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశాం. మూడో రోజు అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆస్తులపై ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్‌లను తొలగించాం.

నాయకులకు నియమావళిపై అవగాహన

ఎన్నికల నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేశాం. నాయకులకు సహజంగా అవగాహన ఉంటుంది. అయినప్పటికీ మా పనిగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళిని వివరించాం. చేయదగ్గవి, చేయకూడనివి స్పష్టంగా తెలియజేశాం.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు

ఎన్నికల ప్రచారంలో ఏ ప్రభుత్వ ఉద్యోగీ పాల్గొనరాదు. ఎన్నికల ప్రచారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులెవరూ పాల్గొనకూడదు. పబ్లిక్ సెక్టార్ (పీఎస్‌యూ)లలో పని చేసే ఉద్యోగులు కూడా ప్రచారంలో పాల్గొనకూడదు. ఒకవేళ పాల్గొన్నట్టు ఫిర్యాదులొస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోక తప్పదు.

ఫిర్యాదు చేసేవారి పేర్లు గోప్యం

యాప్‌లో ఫిర్యాదు చేయడానికి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఉల్లంఘనపైనైనా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. లేదా నేరుగా నాకు గాని, మా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లకు గాని, ఏఈఆర్వోకు గాని ఫిర్యాదు చేయవచ్చు. లేదా గాజువాక కంట్రోల్ రూమ్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. దీనికోసం 0891–2760025, 8555085615 నంబర్లను అందుబాటులో ఉంచాం. ఫిర్యాదు చేసేవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

ఖర్చులన్నీ పార్టీకే జమ

యాప్‌లో అనుమతులన్నీ ఉచితంగానే లభిస్తాయి. ఎలాంటి రుసుం ఉండదు. ఎన్ని వాహనాలకైనా అనుమతులను ఆన్‌లైన్‌లో ఉచితంగా ఇస్తాం. అయితే వాటికి సంబంధించిన ఖర్చును పార్టీల ఖాతాలో జమ చేస్తాం. నాయకులకు తెలియకుండానే నిరంతరం మా నిఘా ఉంటుంది. ప్రతీ కదలికను వీడియో తీస్తాం. దాని ఆధారంగా ఖర్చులను పార్టీల ఖాతాకు వేస్తాం. కార్యకర్తలు నిర్వహించే కార్యకలాపాల్లో టిఫిన్‌లు, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, చివరకు టీలకు సంబంధించిన ఖర్చు కూడా పార్టీకి జమ అవుతుంది. ప్రస్తుతం అభ్యర్థులు లేరు కనుక ఆ ఖర్చు పార్టీలకు వేస్తాం. అభ్యర్థులు వచ్చాక వారి ఖాతాకు జమ అవుతుంది. వారి తరఫున ఎవరైనా కార్యకలాపాలు నిర్వహించిన ఖర్చు మాత్రం అభ్యర్థులకు జమ అవుతుంది.

ఫిర్యాదు అందిన 40 నిమిషాల్లోనే చర్యలు

ఫిర్యాదు చేసిన 40 నిమిషాల్లో చర్యలు తీసుకుంటాం. సీ విజిల్ యాప్‌ద్వారా ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది ముందుగా జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. అక్కడ్నుంచి మాకు చేరుతుంది. వెంటనే సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేసి ఫిర్యాదుపై చర్య తీసుకుంటాం. దీనికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లు పని చేస్తాయి. ఆ టీమ్‌లు ఉపయోగించే వాహనాలకు జీపీఎస్‌ను యాక్టివేట్ చేశాం. యాప్‌లో ఫిర్యాదు చేసేవారి ఫోన్ కూడా ఆటోమేటిక్‌గా జీపీఎస్‌కు కనెక్ట్ అవుతుంది. దాని ఆధారంగా మా టీమ్‌లు ఫిర్యాదు అందిన స్థలానికి సునాసంగా చేరుకొంటారు.

కౌమార బాలికలు శుభ్రత పాటించాలి



కార్యక్రమానికి హాజరైన బాలికలు

ఉక్కునగరం: కౌమార దశలో ఉన్న బాలికలకు రుతుక్రమ సమయంలో పరిశుభ్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ స్కూల్‌లో 'పరివర్తన్' పేరిట ఈ ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలలో 7 నుంచి 9 తరగతుల విద్యార్థినులకు స్టీల్‌ప్లాంట్ గైనిక్ విభాగం చీఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ జి.సుజాత రుతుక్రమ పరిశుభ్రత, శుభ్రత పద్ధతులపై అవగాహన కల్పించారు. సాంఘిక నిషేధాలు, పారిశుధ్యం, పరిశుభ్రత సౌకర్యాల గురించి వారికి వివరించారు. ఉపాధ్యాయులతో పాటు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ



పెదగంట్యాడ పీహెచ్‌సీ వద్ద అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పెదగంట్యాడలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు రావడం, సాయంత్రమైతే జ్వరం రావడం, ఆకలి వేయకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన వారు ఆరు నెలల పాటు మందులు వాడాలన్నారు. దీనికి సంబంధించి అన్ని మందులు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభిస్తాయని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తనకాల సత్యనారాయణ, అనిల్ కుమార్, భూలక్ష్మి, రాణి, లోవరాజు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 60 మందికి ఉపాధి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం సమీపంలోని నిస్ట్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 60 మంది డిగ్రీ విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారు. నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ సంయుక్తంగా నిర్వహించిన మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపికలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న 6 వందల మంది విద్యార్థులు పాల్గొనగా 60 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. నాంది ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జోయోలిన్ హెప్సిబా, నిస్ట్ చైర్‌పర్సన్ వీరాజమ్మ, ప్రిన్సిపాల్ హనీఫుద్దీన్, నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, హరికుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

టోల్‌గేటు వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ



టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు

అగనంపూడి: మే నెలలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేటు వద్ద వివిధ విభాగాల అధికారు లు వాహనాల తనిఖీ చేపట్టారు. విశాఖ నగర కమిషనర్ ఎ.రవిశంకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజువాక సీఐ, ఎస్‌ఐల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే కార్లు, ఇతర వాహనాలను నిలిపి తనిఖీ చేస్తున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు వస్తు, డబ్బు రూపంలో వస్తున్న రవాణాను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపడుతున్నట్టు వారు తెలియజేశారు. నగదు, మద్యం, బంగారు ఇతర వస్తువుల అక్రమ రవాణా అరికట్టడం లక్ష్యమని అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు తెలిపారు.

ఆర్థిక లావాదేవీలతో గృహిణి ఆత్మహత్య



సత్యశాంతి (ఫైల్)

పెందుర్తి: ఆర్థిక లావాదేవీల్లో మోసపోయిన వేపగుంట సమీపంలోని కృష్ణరాయపురానికి చెందిన ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... గంట్రెడ్డి శ్రీనివాసరావు, సత్యశాంతి(36) కృష్ణరాయపురం సంతోష్‌నగర్ సమీపంలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. స్థానికంగా మహిళలు సమూహంగా పప్పుల చీటీలు వేసుకున్నారు. ఆ నగదును సత్యశాంతి వద్ద ఉంచారు. అధిక వడ్డీలు వస్తాయన్న ఆశతో చిట్టీల నగదుతో పాటు తన సొంత నగదు కలిపి దాదాపు రూ.50 లక్షలు గుమ్మడి నానాజీ, దాసరి నాయుడు అనే వ్యక్తులకు సత్యశాంతి అప్పుగా ఇచ్చింది. అయితే కొన్నాళ్లుగా ఆ నగదు విషయంలో సత్యశాంతికి, నానాజీ, నాయుడుకు మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు నాయుడు, నానాజీలే కారణమని సూసైడ్ నోట్ రాసింది. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు నిందితుల్లో ఒకరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

నేటి నుంచి 'శబల' భోజన పండగ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శుక్రవారం నుంచి ఐదు రోజులపాటు శబల భోజన పండగ నిర్వహించనున్నట్టు ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయ్‌రామ్ తెలిపారు. గోవు ఆధారిత పంటలు, సంప్రదాయ వంటలు, ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తనాల వ్యాప్తి, స్థానిక ఆహారపు అలవాట్లు, వంట పాత్రల వాడకం, స్థానిక చేతి వృత్తుల వారికి ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగించడం కోసం సేవ్ సంస్థ ఐదు రోజులపాటు భోజన పండగ నిర్వహిస్తోందన్నారు. 30 రకాల బియ్యాలతో వంటలు వండటం, వాటిని తినడం వల్ల చేకూరే ఆరోగ్య లాభం వివరిస్తామన్నారు. గోవు ఆధారిత పంటలు పండించే వారికి, అలాంటి పంటలు కోరుకునే వారికి పరిచయ వేదిక ఏర్పాటు చేస్తామన్నారు.

ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్



అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న అండిబోయిన లక్ష్మి, అప్పారావు



మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

పెదగంట్యాడ: ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తానని రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులను గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు చిన్నతనం నుంచి ఆర్యవైశ్యులతో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తన తండ్రి గుడివాడ గురునాథరావుతో కలసి పనిచేసిన వారు ఇక్కడ ఉన్నారని చెప్పారు. తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి 35ఏళ్ల తర్వాత పోటీ చేసే అవకాశం లభించిందన్నారు. ఆర్యవైశ్యులు తనను ఎంతగానో ఆదరిస్తున్నారని, వారికి కృతజ్ఞుడనని తెలిపారు. ఆర్యవైశ్యులు కష్టపడి సంపాదించిన మొత్తంలో కొంత భాగం సమాజసేవకు వినియోగిస్తారని, అది అభినందనీయమని అన్నారు. గాజువాకలో ఆర్యవైశ్యులకు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు. అనకాపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సమయంలో వ్యాపారులు ప్రశాంతమైన వాతావరణంలో కార్యకలాపాలు నిర్వహించుకునేలా చూశామని, గాజువాకలోనూ అలాగే సహకారం అందిస్తామన్నారు. గాజువాకలో ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో తనకు ఉన్న సత్సంబంధాలను వినియోగించి అర్హులైన వారికి పదవులు లభించేలా చూస్తానని చెప్పారు. కులుకూరి మంగరాజు మాట్లాడుతూ గుడివాడ అప్పన్న, గుడివాడ గురునాథరావు ఈ ప్రాంతానికి అనేక సేవలందించారని గుర్తు చేశారు. గుడివాడ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో అమర్‌నాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో గుండా సాంబశివయ్య, తాళ్లూరి మల్లేశ్వరరావు, కారు మూరి మహేష్, కేసారపు శ్రీను రమేష్, కేసారపు సతీష్, కులుకూరి శ్రీనివాసరావు, బొడ్డు కృష్ణారావు, కులుకూరి వెంకటరావు, నాగవల్ల ప్రభోజీ, రఘునాథుని గుప్త, పూసర్ల వెంకటేష్, పూరా రమేష్, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కులుకూరి వాసు, శైలజ, మండవిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యాత కార్పొరేషన్ డైరెక్టర్‌తో భేటీ

పెదగంట్యాడ: రాష్ట్ర మంత్రి, గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ గురువారం యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ, శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండిబోయిన అప్పారావుతో వుడా కాలనీలోని వారి స్వగృహంలో భేటీ అయ్యారు. ఈ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం అమర్‌నాథ్‌ను అండిబోయిన లక్ష్మి, అప్పారావు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రంబ నారాయణమూర్తి, మల్లుల సూర్య నారాయణ, ఈశ్వరరావు, గోవింద్, గౌరీ శంకర్, డేవిడ్ నాగరాజు, నాగేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

మార్టుపూడికి మంత్రి అభినందనలు

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరోసారి నియమితులైన మార్టుపూడి పరదేశిని మంత్రి అమర్‌నాథ్ గురువారం అభినందించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, పిట్టా రెడ్డి, వెంకటేష్, అప్పలరెడ్డి, కాకినాడ పెంటారావు, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై సూచనలు



సచివాలయ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరావు నేతృత్వంలో రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ జిల్లాకు సంబంధించి 13 మంది సచివాలయ కార్యదర్శులకు పోస్టల్ బ్యాలెట్‌పై పలు సూచనలిచ్చారు. 85 ఏళ్లు దాటిన వారు, ఫిజికల్ హ్యాండీక్యాప్డ్, కోవిడ్ బాధితులకు సంబంధించి ఇంటి వద్దకు వెళ్లి 12డీ అప్లికేషన్ నింపించి వారి ఓటును పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అధికారులు, అర్చకుడు, భక్తులు



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిపారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ మెన్ పోటీల్లో స్పైక్‌ను బ్లాక్ చేస్తున్న ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ గురువారం రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. మెన్‌లో ఎనిమిది జట్లు, వుమెన్‌లో నాలుగు జట్లు నాకవుట్ కమ్ లీగ్ పద్ధతిలో తలపడుతున్నాయి. ఈ పోటీలను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లను అభినందించారు. రైల్వే స్టేడియంలో పూర్తిస్థాయి క్రీడా వసతులున్నాయన్నారు. ఈ నెల 24తో ముగియనున్న టోర్నీ పోటీలను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్, ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ బాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.